★ శిథిలాలయం ★

రచన:
శ్రీ పి. రాజేశ్వరరావు

అరుణుడు అరుణకాంతులతో ఆకసం ఆవరించాడు. అప్పుడే రైలు మళుపు తిరిగింది. నా కళ్ళు అప్రయత్నంగా ఆ మూలకి మళ్ళినయ్. గుండె ఝల్లుమనింది. ఆ మళుపు ప్రక్కనే ఉన్న డాబా అవసాన దశలో ఉంది. ఇటుకలు విడి విడిగా ఊడి పోయినయ్. ఇల్లంతా గడ్డి గాదరాలతో నిండింది. ఒక్క మెట్లుమాత్రం రూపంతో ఉన్నయ్. చూస్తుంటే నా హృదయం ద్రవించి అశ్రువులలా కారుతున్నాయ్.

అది ఐదేండ్ల నాటి కథ. ఆరోజు సాయంత్రం ఆ డాబా క్రిందనుండే నడుస్తున్నాను. దాటుతూండేటప్పటికి వెనుక నుండి 'రాజూ' అంటూ కోకిలస్వరం వినబడింది. 'ఎవరు చెప్మా పిలచింది' అనుకుంటూ వెనుకకుతిరిగా. క్రింద ఎవరూ కనబడలేదు. తలెత్తి చూశా ఎవరో ఎందుకో నాకోసమే చూస్తున్నారు. అట్లానే నిలబడ్డా. పరాయి అమ్మాయితో అందులో యువతీమణితోఅమాంతంగామాట్లాడేస్తే కొంపలంటుకుంటాయి. ఆ అమ్మాయి కూడా నా కేసే చూస్తోందా? . . అవునులే . . భయమెందుకు మనసా - 'ధైర్యం పురుష లక్షణం' అని ఉసికొలిపే వెంకాయ్ జ్ఞాపకం వచ్చాడు. వాడే ఉంటే ఈ పాటికి తెగేసి మాట్లాడేవాడు. వాడు అంటూండే వాడు కూడా నన్ను. "ఓరి వాజమ్మా.... అమ్మాయి చూస్తున్నా వెర్రి మోహం వేళ్ళాడేస్తావేం?. చిలిపి పిల్లని చిలిపిగానే చూడు" అని మందలించేవాడు. ఒక్కొక్కటీ ఊహాపథంలో మెరిశాయి. ఒక్క సారి తల విరుచుకొన్నా. ఇంకా అట్లానే చూస్తోంది.... కంఠం సవరించుకొన్నా.

"ఏమండి నన్నేనా పిలుస్తా" అన్నా.

"అవునండి తమరినే కేకేస్తా" అని వయ్యారంగా మాట్లాడింది.

ఏమిటి? ఇంత ఇదిగా మాట్లాడుతోంది.... సమాధానం కోసం వెతుకుతున్నా....

"ఇట్లా ఇంట్లోకి రండీ" అంటూ చకచకా లేడిపిల్లలా పరుగెత్తుతూ లోపలికి దిగింది. నేను ఆలోచనతో వీధి గుమ్మందగ్గరకు నడిచా. ఒక్క నిమిషంలో తలుపు తెరువబడింది. 'రండీ!' అని ఆహ్వానం వచ్చింది. నా కళ్ళు దేనికోసమో వెతుకు తున్నయ్. "రావోయి రాజూ ఏం జ్ఞాపకంలేదు" అంటూ ఓ నలభై ఏళ్ళ పుణ్యస్త్రీ వచ్చింది. దాంతో నామతి పూర్తిగా పోయిందనుకోండి. "ఏమిరా....ఇదేదైనా వింతకల కాదుకదా!" అనుకున్నా.

"ఏమోయ్ రాజూ నువ్వు పెద్దవాడవయ్యావ్. ఏదైనా పెద్ద చదువులు చదువుతున్నావో- ఏమో! మేం జ్ఞాపకం ఎట్లాఉంటాంలే" అంటూ మొదలెట్టింది.

నా నవనాడులు నా ఆధీనంలో లేవు. ఏవేవో వింత భావాలుకల్లుతున్నాయ్. నన్ను ఎరుగకపోతే ఇంత పరిచయస్తులులా మాట్లాడుతారా ఏమిటి... ఏమో! నా ప్రవాహంలోనే కొట్టుకుపోతున్నా....

"ఏమే ఉషా ఇట్లారా ... ఏమోయ్ చెప్తున్నా విను. మేం ఇదివరలో మీ వూళ్ళో ఉండేవాళ్ళం. మా వారు అక్కడ 'ఓవరుసీర్'గా ఉండేవారు. ఆ వూరు నుంచి ఎనిమిదేళ్ళయింది బదిలీఅయి. ఇది మా ఉష. ఆ పూళ్ళోనుంచి వచ్చేప్పటికి మా ఉషకి ఏడవ సంవత్సరము. నువ్వు ఎప్పుడూ మా యింట్లోనే ఉండి ఉషతో ఆడుకుంటూ ఉండేవాడివికదూ .... అన్నీ మరిచావా?" అంది

అప్పటికి నా కన్నీ తెలిశాయ్. నా సందేహాలు మంచులాగ విడ్డాయి. వీరు మావూళ్ళోనే ఉండేవారు. నా చిన్నతనమునుండి అంటే నాకు నాలుగేళ్ళప్పటినుండి వాళ్ళింట్లోనే ఉండే వాడిని. నేను ఆవిడని అత్తా అంటూ, ఓవర్‌సీయర్‌గారిని మామా అంటూ తిరిగేవాడిని. అప్పటికి వాళ్ళింట్లో ఒక ఏడాది చంటిపిల్ల ఉండేది. అదే ఉష. ఉష నేను ఆడుకుంటూ ఉండేవాళ్ళం. చిన్నప్పుడు ఉష

తమాషాగా పిలిచేది. మానాన్నగారు తెగనవ్వుకునేవారు.

"లాజూ ! ఆలుకుంతానికి వత్తావా?" అంటూండేది. నాలుగేళ్ళప్పుడు నన్ను మా వీధి బడిలో చేర్పించారు. త్వరత్వరగా చదివేవాడిని. ఉషకి ఐదోఏడు రాగానే ఆ బళ్ళోనే చేర్చారు. ఇద్దరం కలిసి చదువుతుండేవాళ్ళం. నేను ఉష కంటె రెండు క్లాసులు పెద్ద! అయినా కలిసే చదివేవాళ్ళం. ఎప్పుడైనా ఒక రోజున వాళ్ళ యింటికి ఆప్సెంటు అవుతే అత్తయ్యగారు మాయింటికి వచ్చేవారు. మా అమ్మ, ఆవిడ కబుర్లు చెప్పుకొనేవారు. ఒకరోజున నేను, ఉష గవ్వలాడుతున్నాం. అమ్మ, అత్తయ్యగారు కబుర్లు చెప్పుకుంటున్నారు. అత్తయ్యగారు నావేసి తిరిగి ——

"రాజూ మరీ ఆడపిల్ల పైపోతున్నావే మోయ్" అన్నారు.

"కోడలు గడుసు పిల్ల. మావాడిని మచ్చిక చేసింది" అంది మా అమ్మ.

మాకేం అర్థంకాలేదు. మా ఆటలలో మేం ఉన్నాం. మా అమ్మ మాట వినబడింది.

"వదినగారూ ఉష, రాజు కాపురం చేస్తుఉంటే చూడాలని ఉందండి" అంటూనవ్వింది. "మా అత్తయ్యగారు రాజుని ఎప్పుడో కొనేశాం" అంది.

ఇద్దరు నవ్వుకున్నారు. అట్లానే కాలం గడిచింది....

నాకు పదో ఏడు వచ్చేటప్పటికి వాళ్ళకి మా ఊరు నుంచి ట్రాన్స్ఫరు అయింది. ఆరోజున వాళ్ళింటికి వెళ్లా.

అత్తయ్యగారు అప్పుడే మేడ దిగుతున్నారు. ఉష కూడా తల్లి వెంటే వస్తోంది. నన్ను చూడగానే అత్తయ్యగారు అన్నారు. "రాజూ మేం వెళ్ళిపోతున్నాం మరి.... నీకు ఆడుకుంటానికి ఎవరూ పిల్లలు లేరుకదా. మాతో వస్తావా?" అన్నారు.

దాంతో నాకు ఏడుపు వచ్చింది. అప్పుడే వెళ్ళిపోతున్నారేం? ఇక ఉషతో మాట్లాట్ట మెలా? "ఉషా ఎప్పుడు వెడుతున్నావు?" అన్నా గాద్గదికంగా.

"మరేం నువ్వుకూడ రావూ?" అంది అమాయికంగా.

"మానాన్న ఒప్పుకోడు" అన్నా.

"నే చెప్తాలే" అంది ముఖం అదోకలా త్రిప్పి ...

ఉష మాట్లాడితే ముత్యాలు రాలేవి. నవ్వితే నవ రత్నాలు రాలేవి.... ఆముఖం ప్రసన్నతేజం చూస్తుంటే ముద్దొచ్చేది. ....

అంతే! మళ్ళీ కనబడలేదు.... ఇదంతా ఒక్కసారి 'సినిమా రీలులా' నా మెదడులో తిరిగింది.........

ఉషకేసి చూశా. ఎంత తీవి, వయ్యారం వచ్చాయ్! సృష్టి సౌందర్యం అంతా ఉష ముఖంలోనే యిమిడ్చినట్టుంది. ఆ చిలిపికళ్ళు కలువరేకుల్లా విచ్చాయి. వర్ణింప లేని అందం ఉంది ఉషలో.... !

"జ్ఞాపకం వచ్చింది అత్తగారు" అన్నా.

"ఏం చేస్తున్నావోయ్, అమ్మా, నాన్నగారు కులాసాగా ఉన్నారా?" అని అన్నారు.

"ఇక్కడే చదువుతున్నానండి.... అందరు ఇంటివగ్గరే ఉన్నారు."

"మా ఉషకి పెండ్లయింది రాజూ, మా అల్లుడు మద్రాసులో ఉంటున్నాడు. వాళ్ళకీ మాకూ తగాదాలు వచ్చాయ్" అంటూ ఉపన్యాసం మొదలెట్టారు.

అయినా ఆడవాళ్ళు ఉపన్యాసాలు మొదలెట్టారంటే వదిలిపెట్టరు. వినేవాళ్ళకి ఓపిక ఉండాలికాని......... ఆ సారాంశం ఇది.

ఉషని డబ్బున్న కుటుంబంలోనే ఇచ్చి పెళ్ళి చేశారు. వాళ్ళింట్లో కోడరికం ఎక్కువ. ఆపిల్లాడు కూడా చాల బాధపెట్టాడుట. ఆ మధ్యనే దురభ్యాసాలుకూడా అబ్బాయి! తెగత్రాగి వచ్చి ఉషని చావకొట్టేవాడట! అందుకే ఇక అక్కడ ఉంచక 'ఈ పిల్లని నా కొడుకే అనుకుంటా' అని మామయ్యగారు తీసుకొని వచ్చారట! ఇక్కడ వీణ చెప్పిస్తున్నారుట. స్కూలుఫైనలు చదివిందిట. ఇంకా.... ఇంకా ఏవో చెప్పారు.

"అయితే అత్తయ్యగారూ! ఉషకి తమ్ముళ్ళెవరూ...." అన్నా.

"లేరు నాయనా, అందుకే ముద్దుగా చూసుకుంటున్నాం. కాని ఈ గొడవతో మాజీవితాలు నశించేట్టున్నాయ్.

ఒకఇంటిదాన్ని చేశాం. అది సుఖపడుతుంది అనుకుంటే దానియోగం ఇట్లాకాలింది" అంటూ నిట్టూర్చింది.

ఉష మా సంభాషణలో పాల్గోలేదు. అట్లానే చూస్తూ కూర్చుంది.

"రాజూ ఇక్కడ ఎక్కడ ఉంటున్నావ్" అని అన్నారు.

"హాస్టలులోనేఉంటున్నా." అని సమాధానం చెప్పా.

'అమ్మా రాజు చాలా సున్నితంగా మారాడమ్మా. మిత భాషిత్వం నేర్చుకున్నాడు.' వయ్యారిభామ వయ్యారంగా మాట్లాడింది.

"ఆ ...(. నీ అంత సుకుమారం, లేనీ నాకెట్లా వస్తుందిలే'' అని చిలిపిగా అన్నా.

"రాజూ. మాటకారికూడా అయ్యావు.'' అందావిడ.

ఇంతలోనే పరిచారిక ఫలహారం కాఫీలు తీసుకొచ్చింది. మొదట్లో కొద్ది మొఖమాట పడినా నావంతు చెల్లించా.... అదయింతర్వాత కొద్దిసేపు మాట్లాడి వచ్చా.

అట్లానే శెలవులున్నప్పుడల్లా వాళ్ళింటికి వెళ్ళేవాడిని. ఒక్కొక్కప్పుడు మామయ్యగారు కూడ మాసంభాషణలో పాల్గొనేవారు. పాపం! ఆయన ఉషని గురించే బెంగపెట్టుకున్నారు. ఇదివరకటిలా లేందే? పూర్తిగా చిక్కిపోయారు. వెండితీగెల్లా జుట్టు తెల్లబడింది. అత్తయ్యగారు లేనప్పుడు నేను, ఉష డాబామీద కబుర్లు చెప్పుకునేవాళ్ళం. పున్నమ వెన్నెలలు వెల్లివిరుస్తున్నయ్. ఆ డాబామీదికి ప్రాకిన మాధవీలత పువ్వులతో కలకల్లాడుతోంది. మాలతీపూల సౌరభం పీలుస్తున్నకొద్దీ హాయిని కలిగించింది. ఆ డాబామీద కబుర్లు చెప్పుకుంటున్నాం. ఉష ఆ చంద్రకాంతుల్లో 'దేవకన్య' లావుంది. ఆ అందం నన్ను ముగ్ధుణ్ణి చేసింది.

"ఐతే ఉషా. నీజీవితం ఇట్లా అణగారవలసిందేనా?" అన్నా.

'ఇందులో క్రుంగవలసినదేముంది రాజూ? ఆయన త్వరలోనే నన్ను అనుగ్రహిస్తారు. ఆయన్నే భర్తగా భావించా రాజూ!' అన్నది ఉష.

"అంతవరకు ఇట్లా బాధ పడవలసిందేనా? ఆయనకి పశ్చాత్తాపం కలుగుతుందనే భావిస్తున్నావా?'' అని ప్రశ్నించా.

'రాజూ నీవు తప్పుగా అర్థం చేసుకున్నావు ఆయన్ని.... ఇప్పుడుకాకపోయినా కొద్దిరోజుల్లో నైనా ఆయన వస్తారు" అంది.

"ఉషా నువ్వు పిచ్చిదానివి. ఈరోజుల్లోకూడ అంత గ్రహింపున్నవాళ్ళుంటారనేనా? నీ తల్లిదండ్రులు ఎంతగా కుములుతున్నారో చూశావా? ఇట్లా నిరీక్షిస్తూకూర్చుంటే నీజీవితం నిరాశ, నిశ్పృహలతో గడవవలసిందేనా?" అని ఉపన్యాస ధోరణిలో సాగించా.

''అన్నా. నాజీవితం నిస్సారమైనా బాధలేదు. నేను చనిపోయినతర్వాతనైనాసరే నా భర్త అర్థం చేసుకుంటారు. అంతే నాకు కావలసినది." ముత్యాల్లాంటి కన్నీళ్ళని పమిటకొంగుతో తుడుచుకొంది.

"చెల్లీ నేను నిన్ను సరిగా అర్థం చేసుకోలేకపోయా. కలియుగంలో కూడ ఇంత అద్భుత మనస్థత్వం ఉంటుందా అని ఆలోచిస్తున్నా. అమ్మా.... ఉషారాణీ! నన్ను ''అన్న"గా గ్రహించు తల్లీ. నా సాధ్యమైనంత వరకు బావని మార్చేందుకు ప్రయత్నిస్తా." "అన్నా "ఇన్నాళ్ళకి నాకు 'అన్న' వచ్చాడుగా నాకేం భయం లేదిక" అంది.

మళ్ళీ వారానికి వాళ్ళింటికి వెళ్ళా. ఓవరుసీరుగారు జ్వరంతో బాధ పడుతున్నారు. డాక్టర్లని 'కన్సల్టు' చేస్తే మనోవ్యాధే కారణమన్నారు. రోజు రోజుకూ జ్వరం అధికమవుతూనే ఉంది. ఎంత మందిస్తేనేం. పటుత్వం లేకపోయాక! డాక్టర్లు కూడా ఏం లాభం లేదని చెప్పారు.... కాని ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఓవరుసీరుగారు మట్టిలో కలిసిపోయారు. అత్తయ్య, ఉషల బాధలు అధికమయ్యాయ్. ఆ విధికి ఉషని గురించే బెంగ. ఏదో ఆయనకి వచ్చే 'Pension' తోనే కాలక్షేపం చేస్తున్నారు. ఆ డాబా ఒక్కటి ఉంది వాళ్ళకి ఆస్తి. వాళ్ళని ఓదారుస్తూ ఉండేవాడిని.

ఏదో పనుండి మద్రాసు వెళ్ళా. ఉష దగ్గర ఆమె భర్త 'ఎడ్రస్సు' తీసికున్నా. నాపని పూర్తయాక ఆ ఎడ్రసు ప్రకారం వెళ్ళా. తలుపు తీసికొని వెళ్ళేప్పటికి ఒక సోగకళ్ళ సుందరాంగి ఎదురుగ కూర్చుని 'డ్రెస్'

చేసుకుంటోంది. ఆమెని ఉషభర్తని గురించి అడిగా. ఆవిడ నన్ను ఎగాదిగా చూసింది. 'మీదేవూరండి' అంది.

''మాదేవూరైతేనేంలెండి. ఆయన ఉన్నారా?'' అన్నా తీవ్రంగా.

ఆవిడకి కోపం వచ్చింది కామోసు. పెద్ద సీరియస్‌గా ''ఎక్కడికో వెళ్ళారు'' అంది.

మళ్ళీ సాయంత్రం తీరుబడి చేసికొని వెళ్ళా. ఆయన్ని అంతకు పూర్వం చూడలేదు. 'ఫలానా వారు ఎవరండీ?' అన్నా. 'నేనే ఎందుకోసమండీ' అన్నాడా నవీనుడు.

నేను ప్రసంగం మొదలెట్టా. ''ఓవరుసీరుగారు, నన్నె రుగుదురని, చిన్నప్పటినుంచి నన్ను కూడ పెంచారని ఏదేదో చెప్పి అసలు 'Point' కి వచ్చి ఓవరుసీరుగారు చనిపోయారని ఉష నిరాశ, నిస్పృహ, నిరీక్షణాలతో కాలం గడుపుతోందని, అత్తయ్యగారు దీన్ని గురించి, బెంగతో కృశిస్తున్నారని చెప్పి వెళ్ళి ఆ సంసారాన్ని ఒడ్డుకి చేర్చ వలసిం''దని ప్రార్థించా. ఎంత చెప్పినా ఏంలాభం? చెవిటివానిదగ్గర శంఖారావమే.

"అసలు ఇంతకీ ఈ విషయంలో మీకు జోక్య మెందుకు?'' అన్నాడు.

''బావగారూ వాళ్ళని చూసినకొద్దీ నా హృదయం బ్రద్దలవుతోంది. వాళ్ళని అనుగ్రహించండ''న్నాను. ఆయన ఏవేవో దుర్భాషలాడేడు. మద్రాసులో నా పని పూర్త యాక బయలుదేరి వచ్చేశా. ఉషతో మాత్రం నేను ఆయన్ని కలుసుకొన్నట్టు చెప్పా.

నేను శెలవుల్లో ఇంటికివెళ్ళా. మా అమ్మతో ఈ విషయం అంతా చెప్పా. ఆమె ఎంతగా విచారించిందో! ఇంటిదగ్గర ఉంటున్నానన్న తప్ప నా ఆలోచనలు, మనస్సు అక్కడే ఉంట. ఆమెకి ఉల్లాసంగా గడిపే రోజుల్లో విచారం చుట్టుకొంది. ఎట్లానో ఆ సెలవు గడిపి మళ్ళీ ఆ ఊరు చేరుకున్నా. ఆ వేళే వాళ్ళింటికి వెళ్ళి చూశా. ఇల్లంతా భయంకరంగా ఉంది. గబ్బిలాలు మాత్రం పరుగులెడుతున్నాయ్. చీకటి కోణం డాబా అవసాన దశలో ఉంది. ఇటుకలు చవుడు రాలిపోతోంది. దాని ముఖంకేసి చూసేవాడెవడు?. గట్టిగా 'ఉషా' అంటూ పిలిచా. ఏ ప్రక్కనుంచో చిన్న మూలుగు వినబడింది. నా గుండె అదురుతోంది. ఎడమకన్ను అదురుతోంది. ఏవో అశుభ సూచనలు కనుపిస్తున్నాయ్. మెల్లగా ఆ దిశకు వెళ్ళా. ఆరిపోయే దీపకళికలాగుంది ఉష. దగ్గర కూర్చుంటానికే శక్యంకాలేదు. ఇల్లంతా మట్టి మషాణం. తలంటుకొని ఎన్నాళ్ళయిందో. ఆ గుడ్డలు ఎన్నాళ్ళయి బానని చూశాయో! చేయి చాపింది. కొన ఊపిరితో ''మా అమ్మ చచ్చిపోయింది రాజూ!'' అంది. నాకు ఒక్కసారి కంపమెత్తింది. అయ్యో! ఈ కుటుంబానికి ఎన్ని కష్టాలు కల్గాయి ఇక ఉష జీవితం ఎట్లా....?

"నాకూ .. జ్వరం రాజూ" అన్నది.

"నేను డాక్టరుని తీసికొస్తా కొంచెం ధైర్యంగా ఉండు" అన్నా.

"అన్నాయ్! ఏం లాభంలేదు, ఆయనవస్తే ఒక సందేశం చెప్పు. నాజీవితం ఆ మహానీయుని కోసమే బలి దానం చేశా''నని.

''చెల్లీ చనిపోయే టప్పుడు కూడా అతన్ని తలచు కొని ఏంలాభం?.... పరమకిరాతుడు....'' నా నోరు ఆ కృశించిన చేతులతోకప్పింది. 'తప్పు' అన్నట్టు ముక్కు మీద వేలు వేసుకొంది. 'ఉష ఇక చనిపోతుంది, బ్రతకదు' అన్నట్టు ఏవేవో ఘంటారావాలు వినబడుతున్నాయ్.

''అన్నాయ్.... ఈ మాట చెప్పటానికే ఇంతవరకు జీవాలున్నాయ్.... ఇక మర్చిపోనన్ను.. అ..న్నా..య్..'' అంటూ కన్నుమూసింది ఆ పవిత్ర జీవి.

నాకు చదువుపై విసిగెత్తింది. చదువు మానివేశా.... అప్పటినుండి ఇంటిదగ్గరే ఉంటున్నా. నాన్నగారు రిటైర్ అయ్యారు. ఏదో చిన్న ఉద్యోగం చేస్తూ వ్యవసాయంలో పడ్డా....

ఇది జరిగి ఐదు సంవత్సరాలైంది. మళ్ళీ ఇవాళ ఆ శిధిలాలయం కనబడింది నా కళ్ళకి. ఆ మెట్లు చితికి పోయాయ్.. ఆ డాబాయే కూలింది..

నా కన్నీళ్ళని తుడుచుకొన్నా.... మళ్ళీ దూరంగా ప్రకృతిలో కలసిపోతుండే మసకగా కన్పిస్తున్న ఆ శిధి లాలయాన్ని ఒక్కసారిచూశా....

అప్రయత్నంగా చేయెత్తి నమస్కరించా....